సాక్షి కామారెడ్డి

సోమవారం । 23 । జూన్ । 2025



భూ తగాదాలతోనే..
ఇటీవల బిచ్కుంద మండల కేంద్రంలో ఓ వ్యాపారిపై జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు.
- 8లో ▸



ప్రారంభానికి నోచుకోని..
పెద్దకొడప్‌గల్ మండలంలో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.5 /23.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి
కామారెడ్డి టౌన్: పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వ ఉపాధ్యాయులకు అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను పర్యవేక్షకులుగా నియమించే అధికారం లేదని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ)లకు పూర్తి స్థాయి పాఠశాల పర్యవేక్షణ అధికారాలు ఇవ్వాలని ఓ ప్రకటనలో కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాచారెడ్డి : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పాల్వంచ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు సాయిలు, నాయకులు రాములు, మనోహర్ రెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌కు తరలిరావాలి
కామారెడ్డి అర్బన్: కొత్త పెన్షన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన మంత్రికి కలెక్టర్ ద్వారా అందజేసే పెన్షనర్ల మహాజరుపై సంతకం చేయడానికి విశ్రాంత ఉద్యోగులు తరలిరావాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ విషయమై అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతురెడ్డి, విజయరామరాజు, రాష్ట్ర సలహాదారు లచ్చయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్షనర్ల సంతకంతో కూడిన లేఖను సోమవారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు.


జూనియర్ కళాశాల కోసం భవనం పరిశీలన
బీబీపేట : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం స్థానికంగా ఉన్న ఓ భవనాన్ని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ఆదివారం పరిశీలించారు. భవన నిర్మాణం మరో వారం రోజుల్లో పూర్తవుతుందని షేక్ సలాం పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. కళాశాలలో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులు సోమవారంనుంచి తరగతులకు హాజరు కావాలని సూచించారు.

వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా చూడండి
- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి




బాన్సువాడ : పట్టణంలో వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ముందు డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఇటీవల ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ దగ్గరుండి తీయించారు. ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీల్లో తీసిన చెత్తాచెదారాన్ని ఆదివారం పోచారం పరిశీలించారు. డ్రెయినేజీలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రజలకు సూచించారు.

రేపు చలో తెలంగాణ యూనివర్సిటీ



భిక్కనూరు: చలో డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పూర్వ జేఏసీ అధ్యక్షుడు పీబీ.సత్యం తెలిపారు. ఆదివారం ఆయన భిక్కనూరులోని సౌత్ క్యాంపస్‌లో మాట్లాడారు. పీహెచ్‌డీ పూర్తి చేసినవారికి తెలంగాణ వర్సిటీ ద్వితీయ కాన్వొకేషన్ రోజున పట్టాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు భరత్, రమేష్, శ్రీనివాస్, పాండు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనస్ ఎప్పుడిస్తరో?



సర్కారు గత ఖరీఫ్ సీజన్‌లో సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వడంతో చాలామంది రైతులు రబీలోనూ సన్నరకాలు పండించారు. అయితే కొనుగోళ్లు పూర్తై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ బోనస్ ఊసెత్తడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- ధాన్యం సేకరణ పూర్తై నెల.. ఇప్పటికీ పత్తాలేని ప్రోత్సాహకం
- జిల్లాకు రావాల్సింది రూ. 89 కోట్లు
- నిరాశలో అన్నదాతలు

కామారెడ్డి క్రైం : రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని పేర్కొంది. దీంతో పలువురు రైతులు బోనస్‌పై ఆశతో సన్నరకాల సాగుకు మొగ్గు చూపారు. గత ఖరీఫ్ సీజన్‌లో సర్కారు సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అందించింది. ధాన్యం డబ్బులతో పాటే ఒకటి రెండు రోజులు అటూఇటుగా బోనస్ కూడా రైతుల బ్యాంకు ఖాతాలలో జమయ్యింది. దీంతో బోనస్‌పై ఆశతో అన్నదాతలు రబీలోనూ సన్నరకాలు పండించారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించిన వడ్ల సేకరణ పూర్తై నెల రోజులు కావొస్తోంది. ఇప్పటికీ బోనస్ డబ్బులు రైతులకు అందలేదు.

72,852 మంది రైతుల ఎదురుచూపు..

జిల్లాలో ప్రధాన పంట వరి. గతంలో రైతులు ఎక్కువగా దొడ్డు రకాలనే సాగు చేసేవారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామనడంతో ఈ మధ్య సన్నాల వైపు మళ్లారు. యాసంగిలో సన్నాల సాగుకంటే దొడ్డు రకాలే దిగుబడి ఎక్కువగా వస్తాయి. కానీ బోనస్‌పై ఆశతో సన్నరకాలు వేశారు. జిల్లావ్యాప్తంగా రైతులు యాసంగి సీజన్‌లో 2,61,110 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఇందులో దాదాపు 60 వేల ఎకరాల్లో సన్నాలున్నాయి. ధాన్యం సేకరణ కోసం ప్రభుత్వం 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఇందులో 63 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నరకం ధాన్యం సేకరణకే కేటాయించారు. మార్చి నెలాఖరు నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. దొడ్డు, సన్నరకాలు కలిపి 3.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించారు. దీంట్లో 1,78,416 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉంది. సేకరించిన ధాన్యానికి సంబంధించి (మద్దతు ధర) రూ. 886 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. బోనస్ డబ్బులు రూ. 89 కోట్లు ఇప్పటికీ విడుదల చేయలేదు. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వడ్లు విక్రయించిన మొత్తం 72,852 మంది రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం బోనస్ చెల్లించకపోతే రైతులు మళ్లీ పాత పద్ధతిలో దొడ్డు రకాల సాగుపైనే దృష్టి పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

యాసంగి 'భరోసా' రాలే!
ప్రభుత్వం యాసంగి సీజన్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో రైతు భరోసా చెల్లించలేదు. నాలుగెకరాలలోపు రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. నాలుగెకరాలపైన భూమి ఉన్న రైతులకు ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదు. జిల్లాలో 56 వేల మంది రైతులకు సంబంధించి దాదాపు రూ.100 కోట్ల పెట్టుబడి సాయం రావాల్సి ఉంది. ఓవైపు యాసంగి పెట్టుబడి సాయం అందక, మరోవైపు సన్నాలకు బోనస్ రాక సదరు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ తీరుపై వారిలో అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సర్కారు స్పందించి రైతు భరోసాతోపాటు బోనస్ డబ్బులు ఖాతాలలో జమ చేయాలని కోరుతున్నారు.

రూ. 43 వేలు రావాలి



మూడెకరాల్లో సన్నరకం వరి సాగు చేశాను. 86 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. వాటికి సంబంధించి రూ.43 వేలు బోనస్ రావాల్సి ఉంది. నెల రోజులు దాటినా ఇంకా బోనస్ డబ్బులు పడలేదు. ఖరీఫ్ సాగు పనులు మొదలయ్యాయి. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు ఇవ్వాలి.
– నారాయణ, రైతు, బాన్సువాడ

రెండు నెలలు దాటింది..



పది ఎకరాలలో సన్నరకం వరి సాగు చేశాను. 240 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు కేంద్రంలో అమ్మాను. నాకు రూ. 1.20 లక్షల బోనస్ డబ్బులు రావాల్సి ఉంది. వడ్లు కాంటా పెట్టి 2 నెలలు గడిచాయి. ఇంకా డబ్బులు పడలేదు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి.
– సున్నం సాయిలు, రైతు, కాంశెట్టిపల్లి, నస్రుల్లాబాద్ మండలం

త్వరలోనే జమ అవుతాయి
జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం. రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమయ్యాయి. సన్నరకాలకు సంబంధించిన బోనస్ డబ్బులు రావాల్సి ఉంది. వారికి చెల్లించాల్సిన బోనస్ వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతాయి.
– రాజేందర్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కామారెడ్డి

'సిట్' నుంచి కాంగ్రెస్ నేతకు పిలుపు

- వాంగ్మూలం ఇవ్వాలంటూ ఫోన్ కాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుడిగా రాజగోపాల్‌రెడ్డి



కామారెడ్డి క్రైం : రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు కామారెడ్డిలోనూ కలకలం రేపుతోంది. న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వాంగ్మూలం కోసం హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి రావాలంటూ సిట్ ఆయనకు ఆదివారం ఫోన్ కాల్ ద్వారా తెలిపింది.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డికి పార్టీలో ప్రాధాన్యత ఉంది. ఆయన షబ్బీర్ అలీకి నమ్మకమైన వ్యక్తి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నుంచి పోటీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార బాధ్యతలను ఎక్కువగా ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి చూసుకున్నారు. రాజగోపాల్ రెడ్డి సైతం కొండల్‌రెడ్డి వెంటే ఉంటూ పార్టీ ప్రచార, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించారు. అందుకే ఆయన ఫోన్‌ను ట్యాపింగ్ చేసి ఉంటారని తెలుస్తోంది. రాజగోపాల్‌రెడ్డితోపాటు జిల్లాలోని పలువురి ఫోన్‌లు సైతం ట్యాపింగ్‌కు గురైనట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో ఎవరి మెడకు చుట్టుకుంటుందో అని కొందరు అధికారులు, నేతలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగిందంటే..
గత అసెంబ్లీ ఎన్నికలలో కామారెడ్డి నియోజకవర్గంనుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ సీఎం కేసీఆర్, కాంగ్రెస్ నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేశారు. దీంతో కామారెడ్డి ఎన్నికల ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఇద్దరు ముఖ్య నేతలూ కామారెడ్డిలో పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గెలుపే లక్ష్యంగా సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ క్రమంలోనే తన ప్రత్యర్థి వర్గం కదలికలను తెలుసుకోవడానికి కేసీఆర్ వర్గం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఓ ట్యాపింగ్ బృందాన్ని కామారెడ్డికి పంపి ఓ హోటల్‌లో అడ్డా వేసి ప్రతిపక్షాల ఆర్థిక మూలాలను టార్గెట్ చేశారని కేసు ప్రారంభంలో జరిగిన విచారణలో తేలింది. ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్య నాయకుల కదలికలపై, ఆర్థిక లావాదేవీలపై నిఘా పెట్టారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరే విధంగానే ఎన్నికల సమయంలో పలు ఘటనలు సైతం జరిగాయి. కాంగ్రెస్ ముఖ్య నాయకుల్లో ఒకరైన గూడెం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యాపార కార్యాలయంలో జరిపిన దాడుల్లో రూ. 58 లక్షలు పట్టుబడ్డాయి. దేవునిపల్లి ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి నివాసం ఉన్న ఇంట్లో కూడా ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఆయనను గృహ నిర్బంధం కూడా చేశారు. అప్పటి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ ఇంటిపైనా పోలీసులు దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఫోన్ ట్యాపింగ్‌తో వివరాలు తెలుసుకునే దాడులు చేశారని తెలుస్తోంది.

కామారెడ్డిలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరుపై విచారణ జరిపిన ఇంటెలిజెన్స్ వర్గాలు సిట్‌కు నివేదిక సమర్పించాయి. తాజాగా కేసులో పురోగతి రావడంతో ఇప్పుడు ట్యాపింగ్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. సిట్ నుంచి ఇంకా ఎంత మందికి ఫోన్‌కాల్ వస్తుందోనన్న అంశంపై పట్టణంలో చర్చ నడుస్తోంది.

'ధరణి'లో మౌలిక వసతులు కల్పించాలి




సమావేశంలో పాల్గొన్న టౌన్‌షిప్ బాధితులు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక వసతులు కల్పించాలని టౌన్‌షిప్ బాధితులు డిమాండ్ చేశారు. ఆదివారం టౌన్‌షిప్ సమీపంలోని గెలాక్సీ ఫంక్షన్‌హాల్‌లో టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు సమావేశమయ్యారు. అనంతరం టౌన్‌షిప్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పడంతో ధరణి టౌన్‌షిప్‌లో ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేశామన్నారు. మూడేళ్లవుతున్నా ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు కూడా లేకపోవడంతో నివాసం ఉండలేకపోతున్నామని, కొత్తగా ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. వెంటనే కనీస వసతులు కల్పించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ధరణి టౌన్‌షిప్ బాధితుల సంఘం ప్రతినిధులు పి.రాజనర్సింహారెడ్డి, నరాల వెంకట్‌రెడ్డి, జశ్వంత్‌రావు, కైలాస్ రాజేశ్వరరావు, బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు అంతంతే..

- పర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్ విడుదల చేసిన కేంద్ర విద్యాశాఖ
- వెనకబడిన ఉమ్మడి జిల్లా
- మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకంలో వెనుకంజ



నిజామాబాద్‌అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల పనితీరులో ఉమ్మడి జిల్లా వెనకబడింది. కేంద్ర విద్యాశాఖ పాఠశాలల పనితీరుపై ఇటీవల పర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్(పీజీఐ) విడుదల చేసింది. బడుల్లో మౌలిక వసతుల కొరత, డిజిటల్ విద్యావిధానం లేకపోవడం, తరగతికి ఒక టీచర్‌ను నియమించకపోవడంతో అభ్యసన సామర్థ్యం తగ్గి గ్రేడింగ్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు వెనుకబడ్డాయి.

కేంద్ర విద్యాశాఖ 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని రాష్ట్రాల్లో విద్యాస్థితిగతులపై అధ్యయనం చేసి పనితీరు నివేదికలను జిల్లాలవారీగా విడుదల చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ, యూ–డైస్, న్యాస్, ఎండీఎం ద్వారా వివరాలను సేకరించిన కేంద్ర విద్యాశాఖ వాటిని క్రోడీకరించి ఫలితాలను ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో జిల్లాల వారీగా చూస్తే కామారెడ్డి జిల్లా 12వ, నిజామాబాద్ 18వ స్థానంలో నిలిచాయి.

పర్యవేక్షణ.. ప్రక్షాళన లేక..

పాఠశాల విద్యాశాఖలో ప్రతి విద్యార్థిని పాస్ చేయించి పై తరగతికి పంపించే క్రమంలో కాగితాలు మారుతున్నా.. విద్యార్థుల సూక్ష్మ ప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయలేకపోతున్నారు. అలాగే ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేకపోవడంతో ప్రాథమిక బడుల్లో విద్యార్థుల నమోదు క్రమంగా తగ్గుతోంది. చాలా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్లు లేక విద్యార్థులకు డిజిటల్ విద్య అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వహణలో వంట సిబ్బందికి ఇస్తున్న సొమ్ము సరిపోక విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఒక్క నిజామాబాద్ రూరల్ మండలంలో తప్ప అన్ని మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలు ఉండడంతో పర్యవేక్షణ గాడితప్పింది.

మెరుగైన విద్య అందిస్తున్నాం
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నాం. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. కొన్ని చోట్ల ఫలితాలు రాని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. మౌలిక సదుపాయాలు సైతం కల్పిస్తున్నాం. ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.
– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నివేదికలోని ఉమ్మడి జిల్లా పర్ఫార్మెన్స్..

అంశం	మొత్తం మార్కులు	నిజామాబాద్	కామారెడ్డి
అభ్యసన సామర్థ్యాలు	290	102	102
ప్రభావవంతమైన తరగతి గది	90	45	46
మౌలిక వసతులు	51	29	30
పాఠశాల భద్రత, విద్యార్థి సంరక్షణ	35	09	15
డిజిటల్ లర్నింగ్	50	13	10
పరిపాలన విధానం	84	54	55
మొత్తం	600	252	258

ప్రైవేట్ బడుల్లో జోరుగా దందా

✣ పట్టణంలోని గోదాంరోడ్‌లోగల ఓ గదిలో ఓ ప్రైవేట్ స్కూల్‌కు సంబంధించి నిల్వ ఉంచిన (ఆ స్కూల్ పేరుతో ముద్రించిన) పుస్తకాలు, యూనిఫాంలు, టై, బెల్టులు, బ్యాగులను విద్యార్థి సంఘాల నాయకులు పట్టుకున్నారు. ఆందోళన సైతం చేశారు. కానీ విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

✣ పాత జాతీయ రహదారి పక్కన గల ఓ ప్రైవేట్ స్కూల్ ఆవరణలో స్కూల్ పేరిట ముద్రించిన బుక్స్, బ్యాగులు, యూనిఫాంలు, టై బెల్టులు అమ్ముతున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ఈ వ్యాపారాన్ని బట్టబయలు చేశారు. అయినా విద్యాశాఖ షరా మామూలుగానే తీసుకుంది.

✣ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ స్కూల్ యాజమాన్యం యూనిఫాంలు, టై బెల్టుల అమ్మకాల విషయంలో ఓ వస్త్ర దుకాణంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ దుకాణంలో మాత్రమే యూనిఫాంలు, టై బెల్టులు లభిస్తాయి. ఒక్కో యూనిఫాంకు రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. జిల్లాలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ఇలా వస్త్ర దుకాణాలతో కమీషన్లు మాట్లాడుకుని, ఆ షాప్‌లో మాత్రమే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. అంతే కాకుండా చాలా స్కూళ్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో విద్యార్థినుంచి అడ్మిషన్ ఫీజు కింద రూ. 5 వేల చొప్పున వసూలు చేస్తున్నాయి. దీనికి వివిధ రకాల ఫీజులు అదనం..

- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగుల అమ్మకాలు
- నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల ఫీజుల వసూలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిల్వ ఉంచిన బుక్స్

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలు పాటించడం లేదు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, టై బెల్టులు, ఇతర సామగ్రిని యథేచ్ఛగా అధిక ధరలకు విక్రయిస్తున్నాయి. ఏటా స్కూల్ ఫీజులను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నాయి. వివిధ రకాల ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నాయి. పలు పాఠశాలలు ప్రాథమిక విద్యకే రూ. 30 నుంచి రూ. 40 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని ప్రీప్రైమరీ విద్యకు సైతం రూ. 30 వేలకుపైగా వసూలు చేస్తుండడం గమనార్హం.

జిల్లాలో 220లకుపైగా ప్రైవేట్ పాఠశాలలున్నాయి. విద్యా సంస్థలు చదువు, జ్ఞానం అందించే క్షేత్రాలుగా ఉండాలని, ఎలాంటి వ్యాపారం చేయవద్దని ప్రభుత్వ నిబంధనలున్నా అవేమీ అమలుకావడం లేదు. యాజమాన్యాలు యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నాయి. పాఠశాలల ఆవరణలోనే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు నోట్‌బుక్కులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, టైబెల్టులు, షూస్‌ను అమ్ముతున్నాయి. స్కూల్ పేర్లతో ముద్రించి మరీ విక్రయిస్తుండడం గమనార్హం. విద్యార్థి సంఘాల నాయకులు స్కూళ్లపై దాడులు చేసి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు వసూలు చేయరాదు. కానీ రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రతి ప్రైవేట్ స్కూల్‌లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించి ఉచితంగా విద్య అందించాలనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ప్రైవేట్ స్కూళ్లలో విద్యావ్యాపారం బహిరంగంగా జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి



జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాలల్లో యథేచ్ఛగా విద్యా సామగ్రిని విక్రయిస్తున్నారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అయినా విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.
– అరుణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ప్రైవేట్ స్కూల్స్‌లో నోట్‌బుక్స్, బ్యాగులు తదితర సామగ్రి విక్రయించరాదు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. స్కూల్ నోటీస్ బోర్డులో ఫీజుల వివరాలను ఉంచాలి. అధిక ఫీజులు, అడ్మిషన్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.
– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

క్లుప్తంగా

పంటలు విషతుల్యం



బాన్సువాడ రూరల్: సేంద్రియ ఎరువుల వాడకం తగ్గి, రోజురోజుకు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం పెరిగిపోతోంది. ఒకరిని చూసి ఒకరు రైతులు పంటలసాగులో రసాయన ఎరువుల వాడకం పెంచేశారు. నారుమడి మొదలుకుని పంటకోతకు వారం ముందు కంకిరోగం పేరిట రసాయన ఎరువులు పిచికారీ చేస్తుండంతో ఆహారధాన్యాలు విషతుల్యం అవుతున్నాయి. రైతులను వ్యవసాయ అధికారులు తిరిగి సేంద్రియ సాగువైపు మళ్లించాల్సిన అవసరం ఉంది.

కూలిన చెట్టును తొలగించండి



బాన్సువాడ రూరల్: మండలంలోని అవాజీపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఇటీవల వీచిన ఈదురు గాలులకు ఓ చెట్టు కూలిపోయింది. పలు చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వాటిని దాటుకుంటూ అంగన్‌వాడీ కేంద్రంలోకి రావాల్సి వస్తోంది. కూలిన చెట్లను తొలగించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్ రేణుక ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన చెట్టును, కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక మేమే సరఫరా చేస్తాం

- వేరే మండలాల ట్రాక్టర్లు ఇసుక కోసం రావొద్దు
- అడ్డుకుంటున్న పుల్కల్, హజ్గుల్, శెట్లూర్, ఖద్గాం ట్రాక్టర్ యజమానులు



చిన్నదడ్గిలో ఇసుక లేక గుంతలు తవ్వి వదిలేసిన ఇందిరమ్మ ఇల్లు



ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్లు

బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులపై ఇసుక భారం పడొద్దని మంచి లక్ష్యంతో ప్రభుత్వం స్థానికంగా ఉన్న మండలాల్లో ఇసుక క్వారీల నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. ట్రాక్టర్ల యజమానుల ఇష్టారాజ్యంతో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అందక భారంగా మారింది. బిచ్కుంద మండలం పుల్కల్, హజ్గుల్, శెట్లూర్, ఖద్గాంలో ఇసుక క్వారీలు ఉన్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో అన్ని మండలాలకు ఈ క్వారీల నుంచి తీసుకెళ్లవచ్చని జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఇసుక తరలించాలని సూచించారు. పుల్కల్, హజ్గుల్, ఖద్గాం గ్రామాల ట్రాక్టర్ యజమానులు కొర్రీలు పెట్టి మా గ్రామం ఇసుకను మా గ్రామ ట్రాక్టర్ల ద్వారానే ఇసుక విక్రయిస్తాం.. వేరే గ్రామాల ట్రాక్టర్లను క్వారీలోకి రానివ్వమని అడ్డుకుంటున్నారు. మా గ్రామం ఇసుక మేమే అమ్ముతామంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం మండలాల ట్రాక్టర్లకు అధికారులు ఇసుక అనుమతి ఇస్తే తక్కువ కిరాయితో లబ్ధిదారులకు ఇసుక వేస్తామని ట్రాక్టర్లు యజమానులు అంటున్నారు. అధికారులు ఇతర మండలాలకు అనుమతులు ఇవ్వకుండా ఆ నాలుగు గ్రామాల ట్రాక్టర్లకు మాత్రమే ఇసుక అనుమతి ఇవ్వడంతో అధికారులకు ముడుపులు అందుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ధరలు పెంచేశారు..

హజ్గుల్, పుల్కల్, ఖద్గాం ఒక్కో గ్రామంలో 65 నుంచి 85 ట్రాక్టర్లు ఉన్నాయి. ఆరు నెలల క్రితం బిచ్కుందలో రూ.1,800 ట్రాక్టర్ ఇసుక ధర ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.700 నుంచి వెయ్యి పెంచేశారు. జుక్కల్ మండంలో రూ.2,700 ధర ఉండగా రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. పిట్లంలో రూ.3,200 నుంచి రూ. 4,500 ఇసుక ట్రాక్టర్ విక్రయిస్తున్నారు. ఇతర మండలాల ట్రాక్టర్లు ఈ ధర కంటే తక్కువలో ఇసుక విక్రయిస్తామని చెబుతున్నారు. ఇందిరమ్మ గృహాలకు అధికారులు సీనరేజ్ చార్జీలు లేకుండానే ఉచితంగా వేబిల్లులు ఇస్తున్నారు. ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలు, ఇందిర్మ ఇళ్లకు అదే ధరతో ఇసుక విక్రయిస్తున్నారు. ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలకు ట్రాక్టర్‌కు రూ.900 సీనరేజ్ చార్జీలు కట్టాల్సి ఉంటుంది. ఇందిరమ్మ పేరుతో ప్రైవేటుకు, జుక్కల్ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, నారాయణ్‌ఖేడ్, కంగ్టి ప్రాంతాలకు అక్రమ ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పుల్కల్, హజ్గుల్, ఖద్గాం మంజీరా నుంచి ప్రతి రోజు మూడు నుంచి నాలుగు వందల ట్రాక్టర్ల ఇసుక తరలిస్తున్నారు. శనివారం సుమారు 300 ట్రాక్టర్లకు రెవెన్యూ అధికారులు వేబిల్లులు ఇచ్చినట్లు సమాచారం.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక భారం..

ఒక ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి 10 నుంచి 13 ట్రాక్టర్ల ఇసుక అవసరముందని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. జుక్కల్ నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 2,300 ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉందని బిచ్కుంద తహసీల్ కార్యాలయానికి నివేదిక అందించారు. రోజూ వందల ట్రాక్టర్ల ఇసుక ఇందిరమ్మ పేరుతో తరలిపోతుంది కానీ ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక మాత్రం అందని దాక్షలా మారింది. బిచ్కుంద మండలం చిన్నదడ్గిలో సుమారు 10 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటామని ముందుకు వచ్చారు. పిల్లర్ల గుంతలు తవ్వి 20 రోజులు అవుతున్నా ఇసుక మాత్రం అందడం లేదు. ప్రతి రోజు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇసుక ఇవ్వడం లేదు. ప్రైవేటు వ్యక్తులకు ట్రాక్టర్లు అమ్ముకుంటున్నారని లబ్ధిదారులు అంటున్నారు. కలెక్టర్ స్పందించి ఇతర మండలాల ట్రాక్టర్లకు ఇసుక కోసం అనుమతి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రయివేటు నుంచి ప్రభుత్వానికి మారిన కళాశాల

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆర్మూర్ పట్టణ శివారులోని పిప్రి రోడ్డు లోగల 105 ఎకరాల విస్తీర్ణంలో కేవీ రెడ్డి అనే వ్యక్తి ఆధ్వర్యంలో 1966లో ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి కళాశాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ లక్ష్మణ్‌రావ్ ఈ కళాశాలకు మొట్ట మొదటి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు.

- 1967 జూలై 3న యూజీసీ పరిధిలోకి తీసుకొని యూజీసీ యాక్ట్ 2ఎఫ్ (12బీ) గుర్తింపును ఇచ్చారు. 1969–70లో ఇంటర్మీడియట్ విధానాన్ని ప్రారంభించారు.
- 1981లో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ కళాశాలను స్వాధీనం చేసుకుంది. నాటి నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలగా పిలవడం ప్రారంభించారు.
- 1996లో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండుగా వేరు చేశారు.
- 2006లో ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ (ఎన్ఏఏసీ, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్) మొదటి ఫేస్ గుర్తింపు వచ్చింది.
- జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతరం జిల్లాలో నాక్ గుర్తింపు ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్ కళాశాల.

– ఆర్మూర్

విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్ల మార్పు

కామారెడ్డి టౌన్/సదాశివనగర్: కామారెడ్డి పట్టణ, సదాశివనగర్ పరిధిలోని విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్లలో మార్పు జరిగినట్లు ఏడీఈ కిరణ్ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే కింది నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

క్యాడర్	ఫోన్ నంబర్
ఏఈ, కామారెడ్డి టౌన్-1	8712482213
సబ్ ఇంజనీర్ టౌన్-1	8712482220
ఎఫ్ఎం కామారెడ్డి టౌన్-1	8712482214
లైన్ ఇన్‌స్పెక్టర్ ఏరియా-7	8712482215
లైన్ ఇన్‌స్పెక్టర్ ఏరియా-5,6	8712482216
లైన్‌మన్ ఏరియా-6	8712482217
లైన్‌మన్ ఏరియా-7	8712482218
లైన్‌మన్ ఏరియా-5	8712482219
సిరిసిల్లారోడ్ సబ్‌స్టేషన్	8712482235
కలెక్టరేట్ సబ్‌స్టేషన్	8712482210
సదాశివనగర్ పరిధిలోని సబ్‌స్టేషన్లు	
సదాశివనగర్	8712482182
అడ్లూర్ ఎల్లారెడ్డి	8712482176
పద్మాజీవాడి	8712482181
మర్కల్	8712482178
భూంపల్లి	9493735292
ఉత్తునూర్	9014237399

సదాశివనగర్

క్యాడర్	పేరు	ఫోన్ నంబర్
ఏఈ	గంగాధర్	8712482187
లైన్‌ఇన్‌స్పెక్టర్	నగేశ్‌కుమార్	8712482183
లైన్‌ఇన్‌స్పెక్టర్	రావుసింగ్	9133666359
లైన్‌మన్	దడిగె లింగం	8712482184
లైన్‌మన్	శశిధర్	8712482177
లైన్‌మన్	గణేశ్	8712482180
లైన్‌మన్	విజయ్‌కుమార్	8712482179
లైన్‌మన్	సంగ్యానాయక్	8712482185
ఏఎల్ఎం	బాబురావు	8464011923
ఏఎల్ఎం	సుమన్	9908277698
ఏఎల్ఎం	అలీం	7075200729
ఏఎల్ఎం	శ్రీకాంత్	7989923716
ఏఎల్ఎం	మోబ్యా నాయక్	8712482275
ఏఎల్ఎం	విక్రం	7989050198
ఏఎల్ఎం	షేక్ హమీద్	9849485958
ఏఎల్ఎం	తుకారాం	9573480181

పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళనం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాల 1999 -2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాల్వంచమర్రిలోని ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేసుకున్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2009–10 ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు.

మోపాల్: నగర శివారులోని బోర్గాంలోగల ఓ ఫామ్ హౌస్‌లో ఆదివారం నిజామాబాద్‌లోని కాకతీయ జూనియర్ కళాశాల 2002–04 సీఈసీ గ్రూప్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తర్వాత ఆనాటి మిత్రులంతా మళ్లీ ఒక్కచోటికి చేరడంపై వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమాన్ని వారంతా ప్లాస్టిక్ రహితంగా నిర్వహించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యానర్‌ను వస్త్రంతో ఏర్పాటు చేయగా, భోజనాలకు ఆకుతో చేసిన ప్లేట్లను, మొక్కజొన్న కంకులతో చేసిన గ్లాసులను వాడారు.



నిజాంసాగర్ జెడ్పీహెచ్ఎస్ 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఫరీద్‌పేట జెడ్పీహెచ్ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



బీబీపేట: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల కోసం గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం గ్రంథాలయాన్ని కేటాయించడం అనేది అవాస్తవమని, దానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని అన్నారు. సొంతంగా నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదని అన్నారు. గ్రంథాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లో కళాశాల కోసం కేటాయించేది లేదని స్పష్టం చేశారు. కళాశాల కోసం మరో భవనాన్ని చూస్తున్నారని అన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



ఎల్లారెడ్డి: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తిమ్మాపూర్‌తండాకు చెందిన నేనావత్ రవి(32)అనే యువకుడు ఆదివారం సాయంత్రం తమ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన బేస్‌మెంట్‌కు నీళ్లు పట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: ఓ తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన జిల్లా కేంద్రంలోని గుమాస్తా కాలనీలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. హన్మకొండకు చెందిన నయీం పాషా యేడాదిన్నరగా కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తూ గుమాస్తా కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరోగ్య సమస్యల కారణంగా 6 నెలలుగా హన్మకొండకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఇంటి యజమాని రాజయ్య వెంటనే నయీంపాషాకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది విచారణ జరిపారు. ఇంట్లోని బీరువాలో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



బాన్సువాడ: పట్టణంలోని బాట చెప్పుల దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. షోరూం నిర్వాహకులు ఉదయం దుకాణం తెరిచి మధ్యాహ్నం మూసివెళ్లారు. కొద్దిసేపటికి దుకాణంలోంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణ యజమానికి సమాచారం అందించారు. వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ అప్పటికే మంటల వ్యాపించి దుకాణంలోని సామగ్రి, చెప్పులు కాలిపోయాయి. దుకాణంలో పెద్ద ఎత్తున పొగ నిండిపోవడంతో లోపల ఉన్న వస్తువులు తీసేందుకు ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు షోరూం యజమాని తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రుద్రూర్: మండలంలోని అక్బర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆదివారం సాయంత్రం రుద్రూర్ వైపు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ చిన్నారితోపాటు ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లిఫారంలో డబ్బుల విషయమై ఘర్షణ పడి దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. జల్లాపల్లిఫారంకు చెందిన శ్రీకాంత్, బీర్కూర్ తండాకు చెందిన సుధాకర్‌కు డబ్బుల విషయంలో గొడవ జరిగింది. గ్రామ పెద్దల సమక్షంలో డబ్బుల సమస్య గూర్చి శనివారం మాట్లాడుతుండగా బీర్కూర్‌కు చెందిన ముగ్గురు, జల్లాపల్లిఫారంకు చెందిన ఇద్దరు గొడవ పడి శ్రీకాంత్, ఆయన తండ్రి ఓంకార్‌పై దాడి చేశారు. దీంతో బాధితులు ఆదివారం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. వర్షంతోపాటు బలమైన గాలుల కారణంగా గ్రామంలోని బీసీ హాస్టల్ ఆవరణలో ఉన్న చెట్టు నేలకూలి, రోడ్డుపై ఉన్న మరో చెట్టుపై వాలింది. అనంతరం రెండు చెట్లు రోడ్డుపై కూలిపోయాయి. ఆ సమయంలో రహదారిపై ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్లు రహదారిపై కూలిపోవడంతో వన్నెల్ బి వైపు రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. గ్రామస్తులు చెట్లను తొలగించడంతో తిరిగి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.40వేల నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం మిర్జాపూర్‌కు చెందిన అంజవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు బాన్సువాడ పోలీసులు తెలిపారు. మిర్జాపూర్‌కు చెందిన అంజవ్వ ఏడాది కాలంగా బోర్లంలో నివాసం ఉంటుంది. అంజవ్వ ఈనెల 16న ఎప్పటిలాగే పింఛన్ డబ్బులు, రేషన్ బియ్యం కోసం మిర్జాపూర్ వెళ్లింది. కానీ ఇప్పటికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వాట్సాప్‌గ్రూపులో పోస్టు చేయగా దోమకొండ బస్టాండ్‌లో కన్పించినట్లు తెలిసింది. కానీ అక్కడికి వెళ్ళే సరికి అమె కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆమె అల్లుడు బోర్లం గ్రామానికి చెందిన కాదిరెడ్డి విజయ్‌కుమార్ బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్ళేటప్పుడు ఆరెంజ్ కలర్ చీర, పసుపురంగు జాకెట్టు ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఎవరికైనా కనిపిస్తే సెల్‌నెంబర్ 9989354036కు సమాచారం అందించాలన్నారు.

గుండారంలో ఒకరు..

నిజామాబాద్‌రూరల్: గుండారం గ్రామ శివారులో ఉన్న క్లాసిక్ పేపర్‌మిల్‌లో పనిచేస్తున్న రాకేష్‌కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ ఆదివారం తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేష్‌కుమార్ తన తమ్ముడు చోటన్‌కుమార్‌తో కలిసి ఈనెల 4న పేపర్‌మిల్‌కు ఉపాధి నిమిత్తం వచ్చాడు. కొన్ని రోజులుగా రాకేష్ కనబడకపోవడంతో బీహార్‌లో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్‌లో సంప్రదించారు. వారు ఇక్కడకు రాలేదని తెలపడంతో అతడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభానికి ముస్తాబైన ఆర్టీసీ బస్టాండ్



ఎల్లారెడ్డి: పట్టణంలో మున్సిపల్ నిధులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని మధ్యలో నిలిచిపోయిన బస్టాండ్ నిర్మాణ పనులకు ప్రత్యేకంగా నిధులను తీసుకుని వచ్చి పనులు పూర్తి కావడానికి సహకరించారు. దీంతో ఎల్లారెడ్డి ప్రజల కల సాకారమైంది. బస్టాండ్‌కు వచ్చిన వారికి గతంలో ఇబ్బందులు తలెత్తడంతో నూతన బస్టాండ్‌ను మున్సిపల్ నిధులతో నిర్మించారు. ఈనెల 24న మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా బస్టాండ్‌ను ప్రారంభింపజేసి ప్రజలకు అంకితం చేయనున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని పెద్దకొడప్‌గల్ ఇన్‌చార్జి విద్యుత్ మండల అధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు.

ఆదివారం పెద్దకొడప్‌గల్ గ్రామ శివారులో 33 కేవీ లైన్ ఏబీ స్విచ్ బిగించామని తెలిపారు. పెద్దకొడప్‌గల్, శివాపూర్ సబ్‌స్టేషన్‌లకు నిరంతరం విద్యుత్ ఇవ్వడానికి అవకాశం ఉన్నప్పటికీ గతంలో ఏబీ స్విచ్ లేకపోవడం వల్ల సమస్య ఏర్పడిందని, ఇప్పుడు ఏబీ స్విచ్ పెద్దకొడప్‌గల్‌లో బిగించడం వల్ల ఆ సమస్య తీరిందని చెప్పారు. లైన్‌మెన్ కాశీరాం, రాజేష్ పాల్గొన్నారు.

భూ తగాదాలతోనే వస్త్రల వ్యాపారిపై దాడి

- నిందితులను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి



పోలీసులు పట్టుకున్న నిందితులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణం యజమానిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. భూ తగాదాల కారణంగానే దాడి జరిగినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం వివరాలను వెల్లడించారు. ఈనెల 15న బిచ్కుందలోని ఓ వస్త్రాల షాపులో యజమాని శేక్ ఖలీల్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి పారిపోయారు. ఈ దాడిలో అతడి కి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణా ల్లో విచారణ చేపట్టారు. ఖలీల్‌కు అతడి బంధువులైన షేక్ అమన్ కుటుంబ సభ్యుల మధ్య కొన్నేళ్ల నుంచి భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఖలీల్‌ను చంపి భూమి స్వాధీనం చేసుకోవాలని షేక్ అమన్, కుటుంబ సభ్యులు ప్లాన్ వేశారు. నాందేడ్ ప్రాంతానికి చెందిన ముబీన్, రితేష్, వైభవ్, సుషాంత్ నలుగురు వ్యక్తులకు రూ. 2 లక్షలు సుపారీ ఇచ్చి ఖలీల్‌ను హత్య చేయాలని ఒప్పందం చేసుకున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. షేక్ అమన్ కుటుంబ సభ్యులు పారారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మైసాగౌడ్ మూడు సంవత్సరాల క్రితం ఎలక్ట్రిక్ స్కూటీ తీసుకున్నాడు. ఆదివారం అతడు తన ఇంటి ముందు స్కూటీని నిలిపి చార్జింగ్ ఉంచారు. చార్జింగ్ పూర్తయిన అనంతరం విద్యుత్ కనెక్షన్ తీసివేశాడు. కానీ అప్పటికే చార్జింగ్ కారణంగా వేడెక్కిన స్కూటీకి ఎండలు కూడా ఎక్కువగా ఉండడంతో అందరు చూస్తుండగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్కూటీ పూర్తిగా బూడిదయిందన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పసుల రాజేందర్(28)కు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వ్యాధి ఉండటంతో చాలా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో తరచు బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది గతంలో చాలాసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తిరుమల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పుప్పాలపల్లి గ్రామంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బండమీద గంగాధర్ (52) కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. తన పాత ఇంటిలో గంగాధర్ ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండాపూర్‌లో వివాహిత..

రాజంపేట: మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పుష్పరాజ్, మృతురాలి తల్లి తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం చింతపండుపల్లి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి–బాలరాజుల కూతురు లావణ్య(24)కు మూడేళ్ల క్రితం కొండాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహం జరిగింది. లావణ్య ఇటీవల తన బాబు పుట్టినరోజు సందర్భంగా డబ్బులు లేకపోవడంతో తన అత్త, మామల నుంచి ఆస్తిపంపాకాలు చేసుకోవాలని తన భర్త తెలిపింది. కానీ, భర్త మౌనంగా ఉండడంతో ఈనెల 21న రైతుబంధు పడడంతో అత్తమామలను రైతుబంధు డబ్బులు అడగాలని తెలపగా భర్త అడగలేదు. ఈవిషయమై మనస్తాపం చెందిన లావణ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే భర్త ఆమెను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు తల్లి భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో ఒకరు..

నిజామాబాద్‌నాగారం: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని సాయిక్రిష్ణనగర్‌కు చెందిన రాజరప్పు శ్రీనివాస్(25) ఇటీవల బీటెక్ పాస్ అయినట్లు తల్లిదండ్రులకు బంధువులకు తెలిపాడు. కానీ ఈ నెల 21న అతడు ఫెయిల్ అయినట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. దీంతో శ్రీనివాస్ కుటుంబసభ్యులకు నిజం తెలిసిందని మనస్తాపం చెంది, అవమానంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.